సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 3 । జనవరి । 2024



ముగిసిన అధ్యయనోత్సవాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలు మంగళవారం ముగిశాయి. రాత్రి స్వామివారు ఉభయ దేవేరులతో వెండి శేష వాహనంపై ఊరేగారు.



మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



పందెం కోడి రెడీ'

సంక్రాంతి బరిలో బలంగా ఢీకొట్టే కోళ్ల అమ్మకాలు ఊపందుకుంటున్నాయి. బరిలోకి దించే పందెం కోళ్లకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తూ ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

పోలవరం సమన్వయకర్తగా తెల్లం రాజ్యలక్ష్మి



తెల్లం రాజ్యలక్ష్మి

సాక్షి ప్రతినిధి, ఏలూరు : పోలవరం (ఎస్టీ) అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా తెల్లం రాజ్యలక్ష్మిని నియమించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి వైఎస్సార్‌సీపీ 27 మంది సమన్వయకర్తలతో విడుదల చేసిన జాబితాలో ఆమెకు స్థానం దక్కింది. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సతీమణిగా, ప్రభుత్వ టీచర్‌గా రాజ్యలక్ష్మి నియోజకవర్గమంతా సుపరిచితం. 2024 ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి ఆమె పోటీచేస్తారని ప్రకటించారు. బీఏ, బీఈడీ పూర్తి చేసిన రాజ్యలక్ష్మి 24 ఏళ్లకే టీచర్‌గా విధుల్లోకి చేరారు. 23 ఏళ్ళుగా ఏజెన్సీ ప్రాంతంలోనే ఉపాధ్యాయ వృత్తిలో ఉండటంతో నియోజకవర్గంలో ప్రధాన అంశాలపై సమగ్ర అవగాహనతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో విస్తృత పరిచయాలు ఉన్నాయి. ఎమ్మెల్యే బాలరాజు గెలుపులోనూ ఆమె కీలక పాత్ర పోషించారు. ఈ అంశాలను ప్రామాణికంగా తీసుకుని రాజ్యలక్ష్మిని సమన్వయకర్తగా నియమించారు. మంగళవారం రాత్రి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే బాలరాజు ఇంటికి చేరుకుని ఎమ్మెల్యే దంపతులను అభినందించారు. ప్రస్తుతం రాజ్యలక్ష్మి బుట్టాయగూడెం మండలం దొరమామిడి ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

రాజ్యలక్ష్మి బయోడేటా

భర్త పేరు: తెల్లం బాలరాజు (ఎమ్మెల్యే పోలవరం)
వయస్సు: 47
విద్యార్హత: బీఏ–బీఈడీ
వృత్తి: ప్రభుత్వ ఉపాధ్యాయిని
పనిచేస్తున్న స్కూల్: బుట్టాయగూడెం మండలం దొరమామిడి ఎంపీయూపీ స్కూల్
పిల్లలు: ఇద్దరు కుమారులు
గ్రామం: బుట్టాయగూడెం మండలం దుద్దుకూరు

ఆరోగ్యంతోనే అభివృద్ధి సాధ్యం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న నోడల్ అధికారి విజయలక్ష్మి

ఉండి: ఆరోగ్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర నోడల్ అధికారి జే విజయలక్ష్మీ, కలెక్టర్ పీ ప్రశాంతి అన్నారు. మంగళవారం మండలంలోని కలిగొట్లలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలోని క్యాంపు తీరుతెన్నులు, హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్, ల్యాబ్‌లు వంటివి పరిశీలించారు. ఆరోగ్య సురక్ష క్యాంపులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. క్యాంపులో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులతో పాటు నలుగురు వైద్యాధికారులు అందుబాటులో ఉంటారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 92 రకాల మందులు, పట్టణ ప్రాంతాల్లో అయితే 187 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ డీ.మహేశ్వరరావు, తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐలు సభ్యురాలిగా ఓరుగంటి శైలజ



ఓరుగంటి శైలజ

ఏలూరు (టూటౌన్): ఐలు కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ ఎన్నికయ్యారు. డిసెంబరు 28 నుంచి 3 రోజుల పాటు ఐలు 14వ జాతీయ మహాసభలు కోల్‌కతాలో జరిగాయి. ఈ మహాసభ విశేషాలను ఓరుగంటి శైలజ మంగళవారం పత్రికలకు వెల్లడించారు. రాష్ట్రానికి చెందిన 37 మంది ఈ మహాసభల్లో పాల్గొన్నారన్నారు. రాష్ట్రానికి చెందిన సుంకర రాజేంద్రప్రసాద్ అఖిల భారత వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారని, తాను కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఎన్నికైనట్లు చెప్పారు.

ఏలూరు జిల్లాలో పోలీస్ యాక్ట్–30 అమలు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్–30 అమలులో ఉందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఎవరు వ్యవహరించినా చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాంతి చెప్పారు. సెక్షన్–30 అమలులో ఉన్న నేపథ్యంలో కలెక్టరేట్ ముట్టడికి అనుమతి లేదని, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించినా, ప్రభుత్వ ఆస్తులకు హాని కలిగించే పనులు చేసినా అలాంటి వారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ ముట్టడి చేసేందుకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, కలెక్టరేట్ ముట్టడికి రావద్దని కోరారు.

అందరికీ ఆరోగ్యమే లక్ష్యం

- రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం
- మొదటి రోజు 6,169 వేల మందికి వైద్య సేవలు
- 6 నెలల పాటు కొనసాగనున్న జగనన్న సురక్ష
- మొదటి విడతలో 2,77,331 మందికి వైద్య సేవలు





ఆచంటలో నిర్వహించిన సురక్ష క్యాంపునకు హాజరైన జనం, ఉండి మండలం కలిగొట్లలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారికి స్థానికంగా వైద్యం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. దీనిలో భాగంగా ఇప్పటికే జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత విజయవంతంగా పూర్తి చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమం జనవరి 2 నుంచి ప్రారంభమైంది. మంగళవారం జిల్లా వ్యాప్తంగా 13 జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు నిర్వహించారు. ఇప్పటికే వలంటీర్లు, ఏఎన్ఎంలు జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్యశ్రీపై సర్వే నిర్వహించారు. సర్వే పూర్తయిన కుటుంబాలకు సంబంధించి రెండో విడత జగనన్న క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. క్యాంప్‌లు ఏర్పాటు చేయనున్న మండలంలోని గ్రామాల్లో ముందుగా ఇంటింటా సర్వే చేసి ఆరోగ్య సమస్యలున్న వారి రిపోర్ట్‌లను క్యాంపులకు సిద్ధం చేస్తున్నారు.

14 రకాల వైద్య పరీక్షలు

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపునకు సంబంధించి గ్రామీణ ప్రాంతంలో 92 రకాల మందులు, పట్టణ ప్రాంతాల్లో 187 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. మెరుగైన వైద్యం అవసరమైతే జిల్లా, ఏరియా ప్రభుత్వాసుపత్రులకు సిఫార్సు చేస్తారు. మరింత మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ, నెట్‌వర్క్ ఆసుపత్రులకు సిఫార్సు చేస్తారు.

మొదటి విడతలో 2.77 లక్షల మందికి సేవలు

గతేడాది సెప్టెంబర్ 30 నుంచి డిసెంబర్ 3 వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత వైద్య క్యాంపులను నిర్వహించారు. మొత్తం 365 క్యాంపులు నిర్వహించగా, ఈ క్యాంపుల్లో 2,77,371 మందికి వైద్య సేవలు అందించారు. 2,70,704 మందికి మందులు అందజేశారు. 40,646 మందికి కంటి పరీక్షలు చేశారు. 1490 మందిని ఆరోగ్యశ్రీకి సిఫార్సు చేశారు.

95 మంది స్పెషలిస్టుల నియామకం : జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య క్యాంపులకు 95 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ నుంచి 64 మంది, ఆరోగ్యశ్రీ నుంచి 35 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించారు. దీనిలో గైనకాలజిస్టులు 19, జనరల్ మెడిసన్ 8, జనరల్ సర్జరీ 18, ఆర్థోపెడిక్ 20, చిన్నపిల్ల వైద్యులు 10, కంటి వైద్యులు 10, ఇతర స్పెషలిస్టులు 14 మంది వరకూ ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ 2లో జనవరి 2 ప్రారంభమై జూన్ వరకూ 6 నెలలపాటు క్యాంపులు కొనసాగుతాయి. 502 క్యాంపులను నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రామాల్లోని ఆరోగ్య క్లినిక్‌లు లేదా సచివాలయం, వార్డు సచివాలయాల పరిధిలో ఈ వైద్య క్యాంపులను నిర్వహిస్తారు. ప్రతి మండలంలో వారానికి ఒక క్యాంప్ చొప్పున నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో మంగళ, శుక్రవారాల్లో, పట్టణ ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తారు.

ఫేజ్2లో 502 క్యాంపుల నిర్వహణ



జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2లో మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 13 వైద్య క్యాంపులు నిర్వహించారు. ఫేజ్ 2లో 502 క్యాంప్‌లను ఆరు నెలల పాటు జిల్లాలో నిర్వహిస్తాం. ఉచితంగా మందులు, వైద్య పరీక్షలు నిర్వహించడం, మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు సిఫార్సు చేస్తాం.

– డి.మహేశ్వరరావు, డీఎం అండ్ హెచ్‌ఓ

మొదటి రోజు 6,169 మందికి వైద్య సేవలు

పరీక్షలు	మహిళలు
6,000	3,289
పురుషులు	**సిఫార్సులు**
2,880	10

జనవరి 10 వరకూ షెడ్యూల్

మండలం	సచివాలయం
జనవరి 3న	
పాలకొల్లు అర్బన్	బంగారువారి చెరువు
భీమవరం అర్బన్	బలుసుమూడి
ఆకివీడు	ఆకివీడు
జనవరి 5న	
యలమంచిలి	అబ్బిరాజు పాలెం
వీరవాసరం	వీరవాసరం–3
తణుకు	మండపాక
తాడేపల్లిగూడెం	పడాల
పోడూరు	పోడూరు–2
పెనుమంట్ర	మార్టేరు–2
గణపవరం	గణపవరం–2
9న	
ఉండి	ఆర్తమూరు
తాడేపల్లిగూడెం	అప్పారావుపేట
పెంటపాడు	ఆకుతీగపాడు
పాలకోడేరు	పెన్నాడఅగ్రహారం
నర్సాపురం	నవరసపురం
మొగల్తూరు	రామన్నపాలెం
కాళ్ల	బొండాడపేట
ఇరగవరం	పేకేరు
భీమవరం	చినఅమిరం–1
అత్తిలి	ఉనికిలి
ఆచంట	కొడమంచిలి–2
10న	
తాడేపల్లిగూడెం	వాకర్స్ కాలనీ–3
తాడేపల్లిగూడెం	వాకర్స్ కాలనీ–3
పాలకొల్లు	బంగారువారి చెరువుగట్టు
నర్సాపురం	మున్సబ్ వీధి
భీమవరం	ఎస్సీ స్ట్రీట్
ఆకివీడు	ఆకివీడు–5

శ్రీవారి క్షేత్రంలో 14న సంక్రాంతి సంబరాలు

15న నిత్యార్జిత కల్యాణం, ఆర్జిత సేవలు రద్దు



ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఈనెల 14న సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. భోగి పండుగను పురస్కరించుకుని ఆలయ తూర్పు గోపుర ప్రాంతంలో భోగి మంటలు, కోలాట భజనలు, నృత్యాలు, హరిదాసులు, బుడబుక్కల వేషధారణలతో ఈ సంబరాలను అట్టహాసంగా జరుపుతామన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 15న ఆలయంలో స్వామివారి నిత్యార్జిత కల్యాణం, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. 16న సాయంత్రం దొరసానిపాడులో శ్రీవారి కనుమ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని, దాన్ని పురస్కరించుకుని ఆ రోజు మధ్యాహ్నం ఉభయ దేవేరులతో స్వామివారు తొళక్క వాహనంపై ఆలయం నుంచి దొరసానిపాడుకు తరలివెళ్తారని ఈఓ పేర్కొన్నారు.

మాట తప్పని సీఎం



తణుకులో రూ.3 వేలు పింఛను అందిస్తున్న మంత్రి కారుమూరి, చిత్రంలో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్



నరసాపురంలో రూ 3వేలు పింఛన్ అందిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

తణుకు అర్బన్: మాట తప్పని, మడమ తిప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో మంగళవారం తణుకు మున్సిపాలిటీ, తణుకు మండల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల నుంచి పెంచిన రూ.3 వేల పింఛను పంపిణీ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సంకల్పయాత్రలో పేదలు, వృద్ధులు, వితంతువుల కష్టాలను నేరుగా చూసి పింఛనును రూ.3 వేలకు వరకు పెంచుతానని ఇచ్చిన హామీని నూతన సంవత్సర కానుకగా అందచేశారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో దేశ వ్యాప్తంగా రాష్ట్రాలన్నీ ఏపీ వైపే చూసే పరిస్థితి కల్పించారని స్పష్టం చేశారు. వృద్ధులను వారసులు పట్టించుకోని నేటి రోజుల్లో పింఛను వారి జీవనోపాధికి ఆధారంగా మారిందని, అంతే కాకుండా ప్రతి ఇంట్లోను పింఛను వృద్ధుల గౌరవాన్ని పెంచిందని అన్నారు. 13 రకాల పింఛన్లకు సంబంధించి తణుకు మున్సిపాలిటీ, తణుకు మండల పరిధిలో 18,142 మందికి పింఛను సొమ్ము రూ.54 కోట్లు అందజేస్తున్నట్లు చెప్పారు.

ఏ రాజకీయ పార్టీ అయినా మా ప్రభుత్వం ఏర్పాటైతే ప్రజలకు ఈ మంచి పనిచేస్తామని చెప్పడం పరిపాటని, లోకేష్ మాత్రం నేను వచ్చిన తరువాత గుడ్డలిప్పించి కొడతా అంటూ బెదిరించడం ఎంతవరకు సబబని మంత్రి కారుమూరి విమర్శించారు. పైగా మమ్మల్ని ఇబ్బందులు పెట్టిన అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతల పేర్లు ఎర్రబుక్‌లో రాస్తున్నానని మేము రాగానే వారందరి సంగతి చూస్తా అనడం బెదిరింపు ధోరణికి నిదర్శనం అన్నారు. చంద్రబాబు, పప్పు, దత్తపుత్రుడు చేస్తున్న స్వార్థ రాజకీయాలు, బెదిరింపులు ప్రజలు గమనిస్తున్నారని ఈ ఉడత ఊపులు తమ దగ్గర సాగవని హెచ్చరించారు.

తేడా గమనించండి : గత చంద్రబాబు ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య పరిపాలనలో తేడా గమనించాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ప్రజలను కోరారు. జగనన్న ప్రభుత్వం పేదలకు సాయం చేసే ప్రభుత్వమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, అదే స్ఫూర్తితో మంత్రి కారుమూరి అర్హులందరికీ సంక్షేమం అందేలా ఎప్పటికప్పుడు అధికారులతో చర్చలు చేస్తున్నారని అన్నారు. కమిషనర్ బీవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఎంపీపీ ఆర్.ధనరాజు, జెడ్పీటీసీ ఎం.అన్నపూర్ణాదేవి, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు మండల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పొట్ల సురేష్, తణుకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు జంగం ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా స్వావలంబనకు చేయూత

- స్త్రీనిధి పథకంలో పెద్ద ఎత్తున రుణాలు
- ఏలూరు, పశ్చిమలో రూ.1000 కోట్లకు పైగా రుణాలు
- రెండు లక్షలకు పైగా డ్వాక్రా మహిళలకు ఆర్థిక సాయం
- ఏలూరు జిల్లాలో రూ.526.90 కోట్లు, పశ్చిమలో రూ.481 కోట్ల రుణాలు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో మహిళల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం అందిస్తున్న చేయూత మంచి ఫలితాలను ఇస్తుంది. మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళల ఆర్థిక బలోపేతానికి పెద్ద ఎత్తున చర్యలు చేపట్టారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని మహిళా సంఘాలకు పెద్ద ఎత్తున డ్వాక్రా రుణాలుతో పాటు పలు వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు, డైరీ యూనిట్లు వంటివి ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా స్త్రీనిధి రుణాలు అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ళల్లో రెండు జిల్లాలో రూ.1000 కోట్లకు పైగా స్త్రీనిధి రుణాలు అందించడం విశేషం. మహిళల్లో ఆత్మ విశ్వాసం నింపడంతో పాటు ఆర్థికంగా శక్తివంతంగా చేయడంతో ప్రభుత్వం సఫలీకృతమైంది అనేందుకు ఈ లెక్కలే ఉదాహరణ.



ఆర్థికంగా బలోపేతం

చింతలపూడి మండలం శెట్టివారిగూడెంకు చెందిన అనుమలదాసు ఉమాదేవి డ్వాక్రా గ్రూపులో సభ్యురాలు. టైలరింగ్ చేసేవారు. గ్రూపు ద్వారా బ్యాంకు రుణం తీసుకున్నారు. దీనికి అదనంగా స్త్రీనిధి ద్వారా రూ.50 వేలు రుణం ఇచ్చారు. గ్రామంలోనే లేస్ డిజైనింగ్ వర్క్‌ను ప్రారంభించారు. దీంతో ఈమె ఆర్థికంగా బలోపేతం అయ్యారు. తన ఆదాయం పిల్లల చదువులకు, కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. గతంలో వందల్లో సంపాదించే ఆమె ఈ రోజు ప్రభుత్వ సహకారంతో వేలల్లో సంపాదిస్తున్నారు.

– అనుమలదాసు ఉమాదేవి, శెట్టివారిగూడెం, చింతలపూడి మండలం



కుటీర పరిశ్రమ ఏర్పాటు

సాధారణ గృహిణిగా ఉన్న కొవ్వాసు సుధారాణి నేడు విస్తరాకుల తయారీ చేసే కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక రాజీవ్ గ్రూపులో సభ్యురాలైన ఆమె బ్యాంకు రుణానికి తోడు, స్త్రీనిధి రుణంతో తన ఇంటి వద్దే విస్తరాకుల తయారీ చేపట్టారు. పిల్లల చదువులు, ఇంటి అవసరాల కోసం అధిక వడ్డీలకు అప్పుల చేయాల్సిన పరిస్థితి నుంచి ఇప్పుడు తమ అవసరాలు తీర్చుకోగలిగే పరిస్థితికి వచ్చారు. తానే మరి కొంత మంది మహిళలకు జీవనోపాధి కల్పించే స్థాయికి ఎదగడం ఎంతో సంతోషంగా ఉందని చెబుతున్నారు.

– కొవ్వాసు సుధారాణి, కోటరామచంద్రపురం, బుట్టాయగూడెం మండలం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇంతవరకూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా రూ.526.90 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.481 కోట్లు స్త్రీనిధి రుణాలుగా అందజేసారు.

ఏలూరు జిల్లా పరిధిలో అందించిన స్త్రీనిధి రుణాలు

సంవత్సరం	గ్రూపులు	సభ్యులు	రుణాలు (రూ.కోట్లలో)
2019–20	3,586	11,290	55.85
2020–21	3,734	13,712	69.30
2021–22	9,609	31,951	116.24
2022–23	8,263	30,364	142.63
2023–24	5,120	20,642	142.88
మొత్తం	30,312	1,07,959	526.90

పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో స్త్రీనిధి రుణాలు

సంవత్సరం	గ్రూపులు	సభ్యులు	రుణాలు (రూ.కోట్లలో)
2019–20	4,348	14,131	70.16
2020–21	4,403	15,411	77.69
2021–22	8,596	29,691	105.97
2022–23	7,522	27,475	126.35
2023–24	3,968	14,083	100.83
మొత్తం	28,837	1,00,791	481.00

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా పెద్ద ఎత్తున వ్యాపారాలకు, జీవనోపాధికి రుణాలు అందజేస్తుంది. గత నాలుగున్నరేళ్ళల్లో జిల్లాలో రూ.526.90 కోట్ల స్త్రీనిధి రుణాలు అందించింది. దీంతో డ్వాక్రా రుణాలు, స్త్రీనిధి రుణాలతో జిల్లాలో దాదాపు లక్ష మంది మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించారు. స్త్రీనిధి రుణాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఆర్.విజయరాజు, పీడీ, డీఆర్‌డీఏ, ఏలూరు జిల్లా

మహిళల జీవనోపాధికి తోడ్పాటు



డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న స్త్రీనిధి రుణాలు వారి జీవనోపాధికి తోడ్పాటు నందిస్తున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకూ రూ.100 కోట్లకు పైగా స్త్రీనిధి రుణాలు అందించారు. ప్రతీ ఏటా లక్ష్యానికి మించి రుణాలు అందజేస్తున్నారు. ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా శక్తిమంతులు కావాలి.

– ఎన్‌వీ శివప్రసాద్ యాదవ్, పీడీ, డీఆర్‌డీఏ, పశ్చిమగోదావరి జిల్లా

మహిళల ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చేలా..



మహిళల ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చేలా స్త్రీనిధి రుణాలు ఉపయోగపడుతున్నాయి. డ్వాక్రా సంఘాలకు అందించే బ్యాంకు లింకేజీ రుణాలకు అదనంగా వ్యాపారాలు చేసుకుని తమ కాళ్లపై తాము నిలబడేందుకు వీలుగా స్త్రీనిధి రుణాలు అందజేస్తున్నాం. గతంలో గ్రూపులో నలుగురు సభ్యులకే స్త్రీనిధి రుణాలు అందించేవారు. తాజాగా గ్రూపు సభ్యులందరికీ స్త్రీనిధి రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– పి.శశికుమార్, ఏజీఎం, స్త్రీనిధి, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు

క్లుప్తంగా

కుమార్తెను చూసేందుకు వచ్చి తిరిగివెళుతూ..

టిప్పర్ ఢీకొని వృద్ధురాలి మృతి



ఘటనా స్థలంలో వృద్ధురాలి మృతదేహం

ఏలూరు టౌన్: కుమార్తెను చూసి తిరిగి వెళుతూ రోడ్డు దాటుతుండగా టిప్పర్ లారీ ఢీకొనడంతో ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు వైఎస్సార్ కాలనీ ఐదో రోడ్డు ప్రాంతానికి చెందిన నేలపాటి ఎర్రమ్మ (60) భర్త బాబురావు చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తోంది. కుమార్తె కొత్తపేట ప్రాంతంలో నివాసం ఉంటుండగా ఆమెను చూసేందుకు మంగళవారం వెళ్లి తిరిగి వస్తోంది. చిరంజీవి బస్‌షెల్టర్ వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా అప్పటికే లారీని ఓవర్‌టేక్ చేస్తూ వేగంగా వచ్చిన ఓ టిప్పర్ లారీ ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్సై ఎన్.లక్ష్మణ్ బాబు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదని..

ఉరి వేసుకుని భార్య బలవన్మరణం



పామర్తి ఉషా కిరణ్మయి మృతదేహం

నూజివీడు: భర్త తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదనే మనస్తాపంతో ఓ మహిళ ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నూజివీడు మండలం రామన్నగూడేనికి చెందిన పామర్తి మన్మథరావు, పట్టణంలోని నెహ్రూపేటకు చెందిన ఉషా కిరణ్మయి 15 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. మన్మథరావు బస్టాండు దగ్గరలో లైవ్ ఫిష్ దుకాణం నడుపుకుంటున్నాడు. వీరి కుటుంబం ఏడు మెట్ల బావి సెంటర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఇదిలా ఉండగా, ఈ నెల ఒకటో తేదీన ఉషాకిరణ్మయి తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లి తిరిగి అదే రోజు రాత్రి 10.30 గంటలకు ఇంటికి వచ్చింది. రెండో తేదీన ఆమె పుట్టినరోజు కాగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదంటూ భర్తను ప్రశ్నించింది. ఈ విషయమై వారిమధ్య వాదన పెరిగి తీవ్ర వాగ్వివాదానికి దారితీసింది. ఈ క్రమంలో ఉషా కిరణ్మయి కోపంతో పక్క గదిలోకి వెళ్లి లోపల గడియపెట్టి చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఊహించని ఘటనతో ఆందోళనకు గురైన భర్త మన్మథరావు వెంటనే ఈ విషయాన్ని అత్తమామలకు ఫోన్ చేసి చెప్పాడు. వారు వచ్చి చూసేసరికి ఆమె చనిపోయి ఉంది. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో వారు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతిరాలి తండ్రి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ-1 ఎస్.శంకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారుమూరి 'ప్రజా దీవెన'కు బ్రహ్మరథం

- అత్తిలి నుంచి పాదయాత్ర ప్రారంభించిన మంత్రి కారుమూరి
- ప్రజల సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం.. పల్లెల్లోనే రాత్రి బస
- తొలుత మూడు మండలాల్లో, తరువాత మునిసిపాలిటీలో యాత్ర



అత్తిలిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తున్న మంత్రి కారుమూరి


అత్తిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దీవెన పాదయాత్ర చేపట్టినట్టు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం సాయంత్రం అత్తిలిలో సంతాన వేణుగోపాలస్వామివారి ఆలయం నుంచి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభించిన ప్రజాదీవెన పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు ఏకమై వచ్చినా వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. బీసీలకు పెద్దపీట వేసిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని, అన్నివర్గాల ప్రజలకు మేలు జరగడంతో ప్రజలంతా అండగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజలతో మమేకం అయ్యేందుకు ప్రజా దీవెన పేరిట పాదయాత్ర ప్రారంభించానని తెలిపారు. ఎస్ఆర్‌జీఎస్ రూ.6 కోట్ల నిధులు తణుకు నియోజకవర్గానికి మంజూరు అయ్యాయని, ఈ నిధులతో రహదారులు, డ్రెయినేజీలు ఫిబ్రవరి నెలాఖరులోపు పూర్తిచేయనున్నట్లు చెప్పారు. 2009లో తన హయాంలోనే రహదారులు, డ్రెయినేజీలు అభివృద్ధి చేశానని, టీడీపీ హయాంలో దోచుకో దాచుకో అనే విధంగా వ్యవహరించి ఎటువంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు తన హయాంలోనే అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ నాలుగున్నరేళ్లలో రూ.3 వేల కోట్లకు పైగా నిధులతో సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు అందించామన్నారు. అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల్లో ప్రతి గ్రామంలో ప్రజల్ని కలుస్తానని, తర్వాత మునిసిపాలిటీ పరిధిలో తన పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ప్రతిరోజూ పాదయాత్ర ముగిసిన ప్రాంతంలోనే రాత్రి బస చేసి, మరుసటి రోజు ఉదయం పాదయాత్ర మొదలు పెడతానన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.

పెదపేటలో రాత్రి బస

అత్తిలి: మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేపట్టిన ప్రజా దీవెన పాదయాత్ర తొలిరోజు మంగళవారం రాత్రి అత్తిలి పెదపేటలో ముగిసింది. అత్తిలి సంతాన గోపాలస్వామివారి ఆలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర పార్కు, వెంకటేశ్వరస్వామి ఆలయం రోడ్డు మీదుగా బొంతువారిపాలెం, పెదపేటకు చేరింది. స్థానికంగా ఉన్న లూథరన్ చర్చిలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు భోజనం చేసి, అక్కడే బస చేశారు.

పందెం కోడి రె'ఢీ'

సంక్రాంతి వచ్చేస్తోంది.. పందేలకు సమయం దగ్గరపడుతోంది. పండగ బరిలో బలంగా ఢీకొట్టే కోళ్ల కోసం అప్పుడే పందెంరాయుళ్లు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో పందెం కోళ్ల అమ్మకాలు ఊపందుకుంటున్నాయి. బరిలోకి దించే పందెం కోళ్లకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తూ పెంపకందారులు ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారు. వాటికి కఠిన శిక్షణ ఇస్తూ నువ్వా.. నేనా అన్నట్టు పోరాడేలా సిద్ధం చేస్తున్నారు.



శిక్షణలో భాగంగా తలపడుతున్న పుంజులు

- ఊపందుకున్న పందెం పుంజుల విక్రయాలు
- రూ.10 వేల నుంచి రూ.లక్షల్లో కోళ్ల ధరలు
- బరిలో దిగే పందెం పుంజులకు ప్రత్యేక మెనూ
- బలిష్టంగా ఉండేందుకు కోళ్లకు కఠిన శిక్షణ



సీతువ



రసంగి



నెమలి



నీటి తొట్టెలో ఈదుతున్న పుంజు



కెక్కిరాయి



అబ్రాసు



బాదం పప్పు, నువ్వుల నూనెతో తయారు చేసిన తాటిబెల్లం ఉండలను తింటున్న పుంజు



ద్వారకాతిరుమల మండలంలోని ఒక తోటలో పెరుగుతున్న పందెం కోళ్లు

ద్వారకాతిరుమల: సంక్రాంతి పండుగకు మరో 11 రోజులు మాత్రమే సమయం ఉండటంతో పందెం పుంజుల అమ్మకాలు ఊపందుకున్నాయి. కాకి, నెమలి, అబ్రాసు, డేగ, రసంగి, సీతువ, పూల, పర్ల, కెక్కిరాయి వంటి పలు జాతుల పుంజులు సమరానికి సై అంటున్నాయి. ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల ప్రత్యేక శిబిరాల్లో పందెం పుంజుల పెంపకం జోరుగా సాగుతోంది.

పందెంరాయుళ్ల హడావిడి

సంక్రాంతి దగ్గర పడుతుండటంతో జిల్లా వ్యాప్తంగా పందెం రాయుళ్ల హడావుడి అప్పుడే మొదలైంది. గెలుపే లక్ష్యంగా పందెం కోళ్లను బలిష్టంగా తయారు చేస్తున్నారు. పెద్ద బరిలో ఒక్కో పందేన్ని లక్షల రూపాయల్లో వేస్తుండగా, కొందరు పందెం రాయుళ్లు పలు ప్రాంతాల వారితో ఇప్పటికే ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిసింది. బరిలో వారు దింపే పుంజులకు దీటుగా మరింత బలమైన పుంజులను దింపాలన్న లక్ష్యంతో వాటిని సిద్ధం చేస్తున్నారు.

మెనూలో డ్రైఫ్రూట్స్, మాంసాహారం

పెంపకందారులు పందెంకోళ్లకు నిత్యం బాదం పప్పు, జీడిపప్పు, మటన్ కైమాతో పాటు, తాటిబెల్లం, నల్ల నువ్వులు, ఎండు ద్రాక్షా, ఎండు కర్జూరం, సోంపు, అంజూర, ఆక్రోటు, పిస్తా, బాదంతో తయారు చేసిన ఉండలను బలం కోసం అందిస్తున్నారు. వీటి మెనూ చూస్తే ఆహా.. ఏమీ రాజభోగం అనిపించకమానదు. ఉదయం 6 గంటలకు పందెం రాయుళ్లు వాటిని చెరువుల్లో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి తొట్టెల్లో ఈదిస్తున్నారు. తరువాత వాకింగ్ చేయించి, కొద్దిసేపు ఎండలో కడుతున్నారు. 9 గంటలకు అల్పాహారంగా బాదం పప్పు, జీడిపప్పు, మటన్ కైమాలను పెడుతున్నారు. తాటి బెల్లాన్ని నువ్వుల నూనెతో కలిపి, ఉండలుగా చేసి వాటికి తినిపిస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు చోళ్లు, గంట్లు, వడ్లుతో కూడిన మేతను పెడుతున్నారు. వాటికి ఎండ తగులకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్లలోని గాబుల్లో ఉంచుతున్నారు. సాయంత్రం 6 గంటలకు పొయ్యి మీద అట్లపెనం పెట్టి, దానిపై చల్లిన వేడి నీటిని పుంజుల దేహంపై పూస్తున్నారు. ఆ తరువాత బలం కోసం రెవిటాల్ వంటి మందులు వేస్తున్నారు. రోజుకు ఒక్కో పుంజుకు రూ.200లకు పైగా ఖర్చు చేస్తున్నారు. ప్రాక్టీస్‌లో వాటికి ఎన్నో మెలకువలు నేర్పిస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో పుంజు ధర జాతిని బట్టి రూ. 10 వేల నుంచి రూ.లక్షకు పైగా పలుకుతోంది. ఇదిలా ఉంటే పుంజులకు కాపలాగా జాతి శునకాలను ఏర్పాటు చేశారు.

కత్తుల తయారీలో నిమగ్నం

పందేల్లో కోడికత్తుల తయారీదారులదే హవా. బరిని బట్టి వారు డబ్బులు వసూలు చేస్తుంటారు. పండుగ దగ్గర పడుతుండటంతో కత్తుల తయారీలో వారు నిమగ్నమయ్యారు. ఇక పందెం రాయుళ్ల విషయానికొస్తే ఈ సారి కూడా పోలీసులపై గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆ క్రమంలోనే పందేల నిర్వహణకు సిద్ధమవుతున్నారు.

నకిలీ బంగారంతో వ్యాపారికి టోకరా

భీమవరం: నకిలీ బంగారాన్ని విక్రయించి ఒక మహిళ మోసం చేసిందంటూ వ్యాపారి చేబ్రోలు విజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారని వన్‌టౌన్ ఎస్సై ఎన్.హనుమంతరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కురిశేటి వారి వీధిలోని ఒక దుకాణానికి మూడేళ్ల బాలుడితో ఒక మహిళ వచ్చి, పిల్లవాడి మురుగులు సరిపోవడం లేదని విక్రయిస్తున్నానంటూ దానికి సరిపడా విలువ గల గొలుసు ఇవ్వాలని వ్యాపారిని కోరింది. ఆ మురుగులపై 916 కేడీఎం హాల్ మార్క్ కలిగి ఉండడంతో విజయ్‌కుమార్ నమ్మారు. ఆమె వెళ్లిన తర్వాత వాటిని పరిశీలించగా ప్లేటెడ్ బంగారమని గుర్తించారు. డిసెంబర్ 28న ఈ సంఘటన జరగ్గా సోమవారం ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కాగా మోసగించిన మహిళ ఉభయగోదావరి జిల్లాల్లోని సుమారు 50 మంది వ్యాపారులను మోసగించినట్లు తెలుస్తోంది.

నారాయణ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య



అను మృతదేహం

పెనమలూరు: కానూరులోని నారాయణ కళాశాలలో మంగళవారం ఓ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు కథనం మేరకు.. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన బి.సురేష్, రేచల్ కుమారి దంపతుల కుమార్తె బి.అను (17) కానూరు నారాయణ మెడికల్ అకాడమీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. క్రిస్మస్ సెలవులకు ఇంటికి వచ్చిన అనును సెలవులు ముగియటంతో తల్లి రేచల్‌కుమారి మంగళవారం సాయంత్రం కాలేజీలో దించి వెళ్లింది. అయితే హాస్టల్ రూమ్‌లోకి వెళ్లిన అను తిరిగి రాకపోవటంతో సహచర విద్యార్థినులు వెళ్లి చూడగా ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఉండటాన్ని గుర్తించారు. వెంటనే ఆమెను కళాశాల అధికారులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఉయ్యూరు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పీఎం మోదీ దృష్టికి ఆక్వా సమస్యలు

- కేంద్ర మత్స్య, పశుసంవర్థక శాఖ మంత్రి పర్షోత్తం రూపాల
- వాండ్రంలో ఆక్వా రైతులు, ట్రేడర్స్‌తో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాల, వేదికపై మంత్రి అప్పలరాజు

ఉండి: ఆక్వా రంగ సమస్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కేంద్ర మత్స్యశాఖ, పశు సంవర్థక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పర్షోత్తం రూపాల అన్నారు. మంగళవారం రాత్రి వాండ్రం పరిధిలోని ఆక్వా ట్రేడర్స్ అసోసియేషన్ భవనంలో కేంద్ర మంత్రి రూపాల, రాష్ట్ర మత్స్య పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆక్వా రైతులు, ట్రేడర్స్‌తో సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆక్వా రంగ, మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. 2030 నాటికి విదేశాలకు రూ.లక్ష కోట్ల విలువైన మత్స్యసంపద ఎగుమతులకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఇప్పటికే తొమ్మిది రాష్ట్రాల్లో పర్యటించి మత్స్యకారుల సమస్యలను తెలుసుకున్నామన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సాగర్ పరిక్రమ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని, మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గోవా, మహారాష్ట్ర, తమిళనాడులో పర్యటించి ఈ నెల 1 నుంచి 6వ తేదీ వరకు రాష్ట్రంలో ఎంఎంఎస్‌వై స్కీమ్‌లపై ప్రచారంతో పాటు రైతులు, మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. 10 తీరప్రాంత రాష్ట్రాల్లో 88 ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పదోదశ సాగర్ పరిక్రమ్ కార్యక్రమం ద్వారా రూ. 20 వేల కోట్లతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. రాష్ట్ర మత్స్య పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ఆక్వారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కోల్డ్ స్టోరేజ్‌ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తూ సహకరిస్తోందన్నారు. ఫిష్ ఆంధ్రా ఔట్‌లెట్‌లు ఏర్పాటుకు లబ్ధిదారులు, యువత పెద్ద ఎత్తున ముందుకు రావాలన్నారు. ఆక్వారైతులకు విద్యుత్ సబ్సిడీ, మెరుగైన మార్కెట్ ధరలు కలిపిస్తూ రైతులకు అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందన్నారు. రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు, మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు, అప్సడా వైస్ చైర్మన్ వడ్డే రఘురాం, జాయింట్ సెక్రటరీ నీతూప్రసాద్, జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి వరప్రసాద్, ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కే సంగాత్‌మాధూర్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు పాల్గొన్నారు.

ఇంటర్ వర్సిటీ క్రికెట్ పోటీలకు 'వైఎస్సార్' జట్టు ఎంపిక



డాక్టర్ వైఎస్సార్ హెల్త్, సైన్స్ వర్సిటీ క్రికెట్ జట్టు

ఏలూరు రూరల్: చెన్నైలోని హిందుస్తాన్ యూనివర్సిటీలో ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించే మెడికల్ కళాశాలల సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ క్రికెట్ పోటీల్లో పాల్గొనే డాక్టర్ వైఎస్సార్ హెల్త్, సైన్స్ యూనివర్శిటీ జట్టు వివరాలను ఆశ్రం కళాశాల పీడీ వీవీఎస్ఎం శ్రీనివాసరాజు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. జట్టులో విశాఖపట్టణం ఆంధ్ర మెడికల్ కళాశాల నుంచి కేవీ అభిషేక్, ఆర్.పూర్ణచంద్ర, వై.గౌతమ్, జి.ప్రవీణ్‌కుమార్, చినకాకాని ఎన్ఆర్ఐ కాలేజీ నుంచి జి.శివ నిరంజన్, ఎ.అన్వేష్‌బాబు, డి.కిరణ్, విజయవాడ సిద్ధార్థ కళాశాల నుంచి సీహెచ్ రాజేష్, ఎన్.నితిన్, చిత్తూరు అపోలో మెడికల్ కళాశాల నుంచి ఏబీ రక్షిత్, ఎం.లిఖిత్, రాజమండ్రి జీఎస్ఎల్ కాలేజ్ నుంచి పి.సునిల్‌కుమార్, షేక్ గంజికుతుబ్, ఆశ్రం కళాశాల నుంచి ఎం.సాయిషణ్ముఖ్, అమలాపురం కోనసీమ డెంటల్ కాలేజ్ నుంచి వి.సాయిచందు, ఒంగోలు జీఎంసీ నుంచి సచిన్‌చౌదరి ఉన్నారన్నారు. వీరితో పాటు కేపీఎస్ రామకృష్ణ, డి.ప్రకాష్, ఎస్కే మహ్మద్ జక్కీ, ఎస్.కిరణ్‌గోపాల్ స్టాండ్‌బైగా ఉన్నారు. జట్టు ఎంపికలో తనతో పాటు ఈ.త్రిమూర్తి, విజయసారథి, గాంధీ, నాగూర్ పాలు పంచుకున్నారని వివరించారు.

దూరప్రాంతాలకు వెళ్లి పింఛను అందజేత



అమలాపురంలో లబ్ధిదారుకు అందిస్తున్న ఇలపర్రు వలంటీరు ప్రకాష్ రాజ్



తణుకులో వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఒరిగేటి వరుణ్ రాల్ఫ్

పెనుగొండ: లబ్ధిదారులు దూరప్రాంతంలో ఉన్నా అక్కడకే వెళ్లి పింఛను అందజేస్తూ తమ నిబద్ధతను చాటుతున్నారు వలంటీర్లు. మండలంలోని ఇలపర్రుకు చెందిన వృద్ధురాలు గుబ్బల శేషారత్నం అనారోగ్యం కారణంగా కోనసీమ జిల్లా అమలాపురంలో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లింది. విషయం తెలుసుకున్న వలంటీర్ నూకపెయ్యి ప్రకాష్‌రాజ్ మంగళవారం బస్సులో అమలాపురం వెళ్లి శేషారత్నంకు పెరిగిన పింఛను సొమ్మును అందించారు. దీంతో వలంటీర్ సేవలకు శేషారత్నం కృతజ్ఞతలు తెలియజేయగా, ప్రకాష్‌రాజ్‌ను మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు అభినందించారు.

తణుకు వెళ్లి..

పాలకొల్లు అర్బన్: వయోభారంతో పాటు అనారోగ్యంతో లేవలేని స్థితిలో కుమార్తె ఇంటి వద్ద ఉంటున్న వృద్ధుడికి ప్రతి నెలా తన సొంత ఖర్చులతో తణుకు వెళ్లి వలంటీర్ పింఛన్ అందజేస్తూ పలువురి మన్నన పొందుతున్నారు. పాలకొల్లు పట్టణంలోని 26వ వార్డుకు చెందిన భాస్కర్ల ప్రసాద బాబు పక్షవాతం కారణంగా కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. మొదట్లో ఆయన పాలకొల్లుకు ఆటోలో వచ్చి పింఛన్ సొమ్ము తీసుకునేవారు. అయితే వలంటీర్ ఒరిగేటి వరుణ్‌రాల్ఫ్ వృద్ధుడు పడుతున్న ప్రయాసను చూసి ప్రతి నెలా తానే తణుకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. మంగళవారం ఇలాగే తణుకు వెళ్లి పెరిగిన పింఛన్ సొమ్ము రూ.3 వేలు ప్రసాదబాబుకి అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సంక్షేమం కోసమే నిర్ణయాలు

రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



వేల్పూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి, తదితరులు

తణుకు టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్న పేదల సంక్షేమం కోసమేనని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో రూ. 6 కోట్ల వ్యయంతో నిర్మించే 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన సభకు పార్టీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. వేల్పూరు గ్రామంలో ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సామాజిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం శంకుస్థాపన చేశామన్నారు. ఈ ఆస్పత్రిలో 24 గంటలు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తణుకు మండలంలోని దువ్వ గ్రామంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఓట్లు అడగకుండా ఓటీపీలు అడుగుతున్నారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి లేదని ప్రతిపక్షాలు ఆరోపించడంలో అర్థం లేదన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య శ్రీ పథకంలో మంజూరైన కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మెహర్ అన్సారీ, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, ఎంపీపీ రుద్ర ధనరాజు, వైఎస్ ఎంపీపీ ఐసెట్టి శేషుకుమారి, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు చంద్రు శ్యామల, తాటిపర్తి సుజాత, విజయదుర్గ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గణేష్ నగర్‌లో వేంచేసియున్న వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద షష్టి మహోత్సవం సందర్భంగా మంగళవారం భారీ అన్నసమారాధన జరిగింది. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 5వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. కల్యాణం రామచంద్రరావు, కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కళ్లజోళ్లను అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు: ప్రతి ఒక్కరూ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షుడు నల్లమిల్లి అంజిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గత రెండు నెలల క్రితం కంటిపరీక్షలు చేయించుకొన్న పెంటపాడు గ్రామస్తులకు 50 కళ్లజోళ్లను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, పెంటపాడు పీహెచ్‌సీ రెండో వైద్యాధికారిణి వి. మౌనిక, ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ, ఈశ్వరి పీహెచ్ఎన్ సుజాత పాల్గొన్నారు.

ఉప్పరగూడెం పెంతెకోస్తు చర్చిలో విందు ఏర్పాటు



తాడేపల్లిగూడెం మండలం ఉప్పరగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన విందు

తాడేపల్లిగూడెం రూరల్: క్రిస్మస్, నూతన సంవత్సర వేడులకను పురస్కరించుకుని మంగళవారం మండలంలోని ఉప్పరగూడెం పెంతెకోస్తు చర్చిలో విందు భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులంతా ఏకమై ఈ విందును ఏర్పాటు చేయడం విశేషం. యువతీ, యువకులు, విద్యార్థులు, చిరుద్యోగులు ఎవరికి తోచిన విధంగా వారు దాదాపు 30 రకాల వంటకాలను వడ్డించారు. పెంతుకోస్తు చర్చి, జైభీమ్ యూత్‌సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ జాన్‌బాబు, కమిటి సభ్యులు మార్ని వెంకట్రావు, ఏలూరి ప్రసన్న, రంగబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన వలంటీర్లు



తణుకులో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ. 3వేలు చేయడంతో లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో పెరిగిన పింఛను పంపిణీలో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సభ అనంతరం వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు అందచేశారు. దీంతో పింఛనుదారులు సంతోషంగా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పుంతలో ముసలమ్మ ఆలయంలో సహస్ర దీప లింగార్చన



పుంతలో ముసలమ్మ ఆలయంలో సహస్ర దీప లింగార్చన దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సీతారాంపేట, కొబ్బరితోటలో యువ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో పుంతలో ముసలమ్మ అమ్మవారి 41వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మేలుకొలుపు, మంగళస్నానం, సుప్రభాత సేవ, విశేష పూజలు జరిగాయి. రాత్రి సహస్ర దీప లింగార్చన భక్తులచే ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజాత్రినాథ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సొసైటీ ద్వారా రైతులకు విస్తృత సేవలు

కాళ్ల: సొసైటీ ద్వారా రైతులకు, సంఘ సభ్యులకు విస్తృత సేవలు అందిస్తున్నట్లు కలవపూడి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ బర్రె గంటయ్య, జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు, సొసైటీ సభ్యులు పెన్మెత్స దుర్గాప్రసాదరాజు తెలిపారు. కలవపూడి సొసైటీలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారు సంఘ సభ్యులకు, రైతులకు, గ్రామస్తులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏటా సంఘం పరిధిలోని రైతులకు సంఘ సభ్యులకు ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా డైరీలు, క్యాలెండర్లు, బ్యాగులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ప్రోత్సాహంతో సంఘం పరిధిలో రైతులకు మరిన్ని సేవలు అందించగలుగుతున్నామని తెలిపారు.

సంక్షేమ పథకాల బ్రోచర్ల అందజేత



అత్తిలిలో ప్రజాదీవెన పాదయాత్రలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్



అత్తిలి లూథరన్ చర్చిలో నిద్రిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

అత్తిలి : గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌లను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అందజేశారు. దారిపొడవునా మహిళలు మంత్రి కారుమూరికి పుష్పాలు చల్లుతూ, హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధితశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎమెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, అత్తిలి ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్లు కూనపరెడ్డి జయరాజు, కందుల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు వట్టికూటి సూర్యనారాయణ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రంభ సూరిబాబు, పోలినాటి చంద్రరావు, గారపాటి నాగరాజు, రామిశెట్టి రాము, గంటా నాగరాజు, బుడితి సుజన్‌కుమార్, కోరుకొల్లు వెంకట్రావు, కాకర్ల విశాలాక్షి, తణుకు, ఇరగవరం మండలాల అధ్యక్షులు మంగెన సూర్య, బోడపాటి సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



పెంటపాడు: ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ



అత్తిలి: జగనన్న ఆరోగ్యసురక్షలో మందులను అందజేస్తున్న సర్పంచ్, తదితరులు

పెంటపాడు: జగనన్న ఆరోగ్యసురక్ష పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ స్కూల్ వద్ద మంగళవారం సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాలా ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడం పెంచడం పేదలకు వరం అని అన్నారు. ప్రభుత్వం ఇంటింటికీ ఉచిత వైద్యసేవలు అందజేస్తున్న జగనన్నను ప్రజలు తప్పక గుర్తుంచుకోవాలన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించడం హర్షించదాయకమన్నారు. అనంతరం ఓపీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, ముదునూరు, పెంటపాడు పీహెచ్‌సీలకు చెందిన వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలతో పాటు, ఎంపీడీవో సీహెచ్. బాలాజీ, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, పార్టీ యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, గ్రామ కార్యదర్శి రామారావు, చక్రవర్తి, రామకృష్ణలతో పాటు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు

అత్తిలి: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 2వ విడత జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అత్తిలి సర్పంచ్ గంటావిజేతనాగరాజు అన్నారు. మంగళవారం అత్తిలి-1 సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వైద్యశిబిరంలో 295 సాధారణ పరీక్షలు, 36 మందికి ఎముకల వైద్యసేవలు, 20 మందికి కంటి పరీక్షలు చేశారు. వైద్యులు డాక్టర్ కె నాగరాజు, డాక్టర్ శ్రీనివాసరాజు వైద్యపరీక్షలు జరిపారు. రోగులకు ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, బీసీసెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, ఎంపీహెచ్ఈఓ జెఎస్ గనిరాజు, ప్రమీలారాణి, ఎంఈఓలు రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు



పెంటపాడు: కబడ్డీ ఆడుతున్న మహిళలు



తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లిలో క్రికెట్ పోటీ దృశ్యం

పెంటపాడు: మండలంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా పెంటపాడు ఎస్టీవీఎన్ హిందూ హైస్కూల్‌లో షటిల్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. దర్శిపర్రు గ్రామంలో కబడ్డీ పోటీలు జరగ్గా, వల్లూరుపల్లిలో ఖోఖో పోటీలు జరిగాయి. పెంటపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రికెట్ పోటీల్లో పెంటపాడు- జట్లపాలెం జట్లు ఆడాయి. రావిపాడు గ్రామంలో మహిళలు ఖోఖో పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈ పోటీలను ఎంపీడీవో బాలాజీ పర్యవేక్షణలో జరగ్గా క్రీడల ఇన్‌చార్జి డి .శేఖర్, పీడీలు సత్తి కన్నారెడ్డి, ఆర్డీ కృపావరం, బి .శ్రీనివాస్, ఎస్. దిలీప్, యోహాను, వైశాలి, ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లిలో ఆడుదాం ఆంధ్ర క్రీడలు ఉత్సాహభరిత వాతావరణంలో జరుగుతున్నాయి. మంగళవారం ఈ పోటీల్లో భాగంగా క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించారు. స్థానిక శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన ఈ పోటీల్లో ఎనిమిది జట్లు తలపడ్డాయి. పీఈటీలు నాగార్జునరావు, శివలీల, ఉమామహేశ్వరి, గంగాధర్, కమలమ్మ, గణేష్, ఎంవీఆర్.కృష్ణంరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కోలాహలంగా శ్రీరామ అక్షింతల పంపిణీ

యలమంచిలి: గ్రామాల్లో శ్రీరామ పూజిత అక్షింతలు పంపిణీ కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ ప్రాణప్రతిష్ఠ అక్షింతలను మంగళవారం పంపిణీ చేశారు. శ్రీరామ విజయ మహా మంత్రం పఠిస్తూ గడప గడపకూ వెళ్లి అక్షింతలతోపాటు, అయోధ్య శ్రీరామ తీర్థ క్షేత్ర ఫొటో, ఆహ్వానపత్రం అందజేశారు. 22వ తేదీ అయోధ్యలో రామప్రతిష్ఠ నిర్వహించనున్న సందర్భంగా ఆ రోజు వరకు ఈ అక్షింతలను పూజా గదిలో భద్రపరచి పూజ చేయాలని చెప్పారు. రామ ప్రతిష్ఠ అనంతరం అందరూ స్నానమాచరించి ఇంటి పెద్దతో ఈ అక్షింతలు వేయించుకోవాలని కోరారు. ఆ రోజు సాయంత్రం తమ ఇళ్ల ముందు ఐదు అంతకన్నా ఎక్కువ దీపాలు వెలిగించి పూజలు చేయాలని కోరారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్ క్లబ్ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ హాల్‌లో మంగళవారం జిల్లా గవర్నర్ అధికారిక పర్యటన జరిగింది. పలు రంగాల్లో ఉన్నవారిని సత్కరించారు. పేద కుటుంబానికి బియ్యం, నెలవారీ సరుకులు అందజేశారు. పేద పిల్లలు చదువుతున్న హాస్టల్‌కు బియ్యం, సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాట్ల లక్ష్మీపతి రాజు, ఎంఎల్ఎస్ఎన్ రెడ్డి, సూర్యదేవ్, పి.సూర్యనారాయణమూర్తి, మదన్‌మోహన్ అగర్వాల్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, చిన్నం జగదీష్, జి.హరిబాబు, పేరిచర్ల మురళీ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

96 మందికి ఉచిత వైద్య పరీక్షలు

లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో 96మందికి ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అధ్యక్షుడు వంగపండు రామమోహన్‌రావు ఆధ్వర్యంలో దాత పచ్చ వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో మంగళవారం కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆసుపత్రిలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థల పట్టాలు



కృష్ణాపురం ఇంటి స్థల పట్టాలు అందజేస్తున్న జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు

తాడేపల్లిగూడెం రూరల్: అర్హులైన ప్రతి నిరుపేదకు ఇంటి స్థల పట్టాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని కృష్ణాపురం, నీలాద్రిపురం గ్రామాల్లోని 50 మందికి ఇంటి స్థల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 36లక్షల మందికి ఇంటి పట్టాలు అందించినట్లు తెలిపారు. ఆయా స్థలాల్లో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ సాయంతో పాటు సామగ్రిని సరఫరా చేస్తుందన్నారు. ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తున్న వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకుని, ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, ఈదర వెంకటేశ్వరరావు, మండల సేవాదళ్ చైర్మన్ కొండుబోయిన కృపావరం, దారపురెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం ఎంతో గొప్పది



మహా నివేదనకు హారతి ఇస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీహనుమద్ వార్షిక మహోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం స్థానిక మారుతి టాకీస్ సెంటర్‌లోని దాసాంజనేయ స్వామివారి దేవస్థానంలో భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హారతులిచ్చి ప్రారంభించారు. అన్ని దానాలకెల్లా అన్నదానం ఎంతో గొప్పదని, భగవంతుని కార్యక్రమాల్లో అన్నదానం నిర్వహించడం భగవత్ సేవతో సమానమని అన్నారు. వేలాది మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అర్చకులు ఘంటసాల భాస్కర శర్మ స్వామివారికి పూజలు చేసి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత



తణుకులో కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న చైర్మన్ పద్మశ్రీరాధయ్య

తణుకు: ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థలో తృతీయ శ్రేణి శాఖా గ్రంథాలయ అధికారిగా విధులు నిర్వహిస్తూ అకాల మృతి చెందిన వేముల వెంకటరత్నం కుమారుడు వేముల సోమరాజుకు కారుణ్య నియామక పత్రాలను సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీరాధయ్య అందజేశారు. పైడిపర్రులోని సంస్థ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈమేరకు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నేతలు జి.రాంబాబు, జి.శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఇప్పటికే పదుల సంఖ్యలో పదోన్నతులు కల్పించడం, సంస్థలోని ఉద్యోగులకు ఎలాంటి ఆపద వచ్చినా వారికి అండగా ఉంటూ ఉద్యోగ పక్షపాతిగా చైర్మన్ పద్మశ్రీరాధయ్య ఉంటున్నారని కొనియాడారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చీర్ల రాధయ్య, ఉద్యోగ సంఘాల నాయకులు పి.రంగారావు, డి.జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదోడి ఇంట పింఛన్ల పండగ

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ఇరగవరంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: పేదొడి ఇంట పింఛన్ల పండగ వాతావరణం నెలకొందని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇరగవరం మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పెంచిన పింఛన్లను మంత్రి కారుమూరి చేతులు మీదగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులకు, వితంతు, ఒంటరి, దివ్యాంగులకు జనవరి 1నుంచి రూ.3000లు చొప్పున పింఛన్లు అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ఆర్బీకేలు, సచివాలయలు పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు మంచి చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మెన్ గుబ్బల తమ్మయ్య, జెడ్పీటీసీ పంపన అంజిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, కె ఇల్లిందలపర్రు, ఇరగవరం సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, చవ్వాకుల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, నాయకులు చోడే జోషి ఎంపీటీసీ మంగెన రామానాయుడు, పాలా సత్యనారాయణ, కుడిపూడి సత్యనారాయణ, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, ఎంఈవో ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గాలికుంటు వ్యాధి టీకాల షెడ్యూల్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ చైర్మన్ పసల

పెంటపాడు: పాడి రైతులు అపోహలు వదిలి తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని మాజీ ఎమ్మెల్యే, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ నూతన చైర్మన్ పసల కనకసుందరావు పేర్కొన్నారు. పెంటపాడు మండలం ముదునూరులో మంగళవారం గాలికుంటు వ్యాధులకు సంబంధించి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పశువైద్యపథకం, గాలికుంటు టీకాల షెడ్యూల్ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పసల కనకసుందరావు మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమన్నారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 2 నుంచి 31 వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భావనధాన్యలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, ఏడీ అనిల్‌కుమార్, డాక్టర్ మహేష్, మాజీ సర్పంచ్ పసల గంగారామచంద్రన్ పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

పాలకోడేరు: పెన్నాడ గ్రామంలోని ఎఫ్‌సీ రోడ్డు లే ఔట్ సమీపంలోని వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై భీమవరం టు టౌన్ సీఐ జి.శ్రీనివాస్ తన సిబ్బంది తో మంగళవారం దాడి చేశారు. ఇద్దరు యజమానులను, అయిదుగురు విటులను అరెస్ట్ చేసి, భీమవరం కోర్టులో హాజరు పర్చినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు

తణుకు అర్బన్: జాతీయ పశు వ్యాధి నియంత్రణలో భాగంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పశువుల పెంపకదారులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా వేయించుకోవాలని తెలిపారు. గాలి కుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాలు ఉత్పత్తి తగ్గిపోవడం, నోరు, గిట్టల్లో పుండ్లు ఏర్పడడం వంటి ఇబ్బందులు వస్తాయని వివరించారు. తణుకు నియోజకవర్గంలో సుమారుగా 20వేల పశువులకు 6 టీంల ద్వారా పశువైద్యాధికారుల పర్యవేక్షణలో సిబ్బంది ఈ టీకాలను వేసేలా కార్యాచరణ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.నరసింహారావు, ముద్దాపురం,వేల్పూరు పశువైద్యులు డాక్టర్ కె.శంకర్ భావన్నారాయణ, డాక్టర్ కె.అశోక్‌రెడ్డి, ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షులు మల్లిరెడ్డి నాగార్జున, కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో 'బేటీ పఢావో బేటీ బచావో'

వీరవాసరం: ఆడపిల్లలను సమాజంలో విద్యకు దగ్గర చేస్తూ, ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడిపేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యులు సత్యనారాయణ రాజు అన్నారు. వీరవాసరం పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన బేటీ పఢావో బేటీ బచావో కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యవంతమైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతి గర్భిణీ 200 ఐరన్ మాత్రలు, రెండు టీటీ ఇంజక్షన్లను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.